దుస్తులు మనకు సౌకర్యాన్నిస్తాయి, రక్షణనిస్తాయి, అందంగా కనబడేలా చేస్తాయి. భార్యాభర్తలమధ్య సంబంధం ఇలా ఉండాలి.

## దాంపత్య సంబంధంలో ప్రేమ కరుణ తొణికిసలాడాలి

భార్యలతో మంచిగా వ్యవహరించాలని ప్రవక్త ప్రోత్సహించేవారు. "భార్యలతో ఉత్తమంగా వ్యవహరించేవాడే మీలో ఉత్తముడు" అన్నారాయన. ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషాను ఆమె భర్త ఇంట్లో ఎలా ఉంటారని అడిగినప్పుడు ఆమె జవాబిస్తూ "మీరందరూ ఇళ్ళలో ఎలా ఉంటారో ఆయన కూడా అలాగే ఉంటారు. కాని ఆయన చాలా మృదువుగా, ఉదారంగా, దయగా ఉంటారని" అన్నారు. ఆయన ఇంటి పనిలో భార్యలకు సహాయ పడేవారు. తన దుస్తులు అవసరమైతే తానే కుట్టుకునేవారు, చెప్పులు మరమ్మత్తు చేసుకునేవారు. క్లుప్తంగా చెప్పాలంటే భార్యలకు ప్రతిపనిలోను సహాయపడేవారు.

> ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే: ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు- మీరు వారి వద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు.నిశ్చయంగా ఆలోచనా పరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.
> (దివ్యఖుర్ఆన్ 30:21)

## తల్లి, కుమార్తెలకు అత్యున్నత హోదా

సంతానంపై తల్లి ప్రభావం అత్యధికంగా ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో. ఆమె తన మమతానురాగాల ద్వారా పిల్లలపై చెరగని ముద్ర వేస్తుంది. నిస్సందేహంగా సమాజాలు తల్లుల పైనే ఆధారపడి ఉన్నాయి. అందువల్ల ఇస్లామ్ తల్లి స్థానాన్ని అత్యున్నతంగా ప్రకటించింది.

ప్రవక్తను ఒకసారి "నా సేవలు పొందడానికి అందరి కన్నా ఎక్కువగా అర్హులెవరని" ప్రశ్నించినప్పుడు ఆయన జవాబిస్తూ "నీ తల్లి" అన్నారాయన. ఆ మనిషి మరో రెండు సార్లు ఆ ప్రశ్నే తర్వాత ఎవరని అడిగాడు. ప్రతిసారి "నీ తల్లి" అని జవాబిచ్చారు ప్రవక్త. నాలుగవ సారి మాత్రమే "నీ తండ్రి" అని చెప్పారాయన.

> "మనిషి తన తల్లిదండ్రుల పట్ల సేవాభావంతో, దయతో మెలగాలని మేము ఆదేశించాము. అతడిని తల్లి కష్టాలతో మోసింది. కష్టాలతో అతడికి జన్మనిచ్చింది."

తల్లి పట్ల దయతో, మంచిగా వ్యవహరించడానికి దేవుడు ప్రతిఫలం ప్రసాదించడం మాత్రమే కాదు, కుమార్తెలను చక్కగా పెంచి పోషిస్తే కూడా ప్రతిఫలం ఇస్తానంటున్నాడు. ఇలాంటి వాగ్దానమేదీ కుమారులవిషయంలో లేదు. ఈ విషయమై ప్రవక్త ఇలా అన్నారు. "అల్లాహ్ ఇద్దరు కుమార్తెలను ప్రసాదించిన వ్యక్తి ఆ ఇద్దరు కుమార్తెలను దయతో చూసి చక్కగా పెంచితే అతను స్వర్గానికి అర్హుడవుతాడు."

## ముగింపు

ఇస్లామ్‌కు ముందు స్త్రీలను చాలా తక్కువగా చూసేవారు. ఆడపిల్ల పుడితే సిగ్గుపడి సజీవంగా సమాధి చేసేవారు. వ్యభిచారం సర్వసాధారణంగా ఉండేది. విడాకులిచ్చే హక్కు కేవలం పురుషుడికి మాత్రమే ఉండేది. వారసత్వ హక్కు కూడా వారికే ఉండేది. అణిచివేతలు కొనసాగేవి. ఇస్లామ్ ఈ చెడులన్నింటిని రూపుమాపింది. ఇప్పుడు కూడా అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు పూర్తి గౌరవమర్యాదలు లభించడం లేదు. మర్యాద, మన్ననలతో వారిని చూడడం లేదు. సమానమైన పనికి సమాన వేతనం కూడా లేదు. కాని ఇస్లామ్ స్త్రీని అత్యంత విలువైనదిగా, అపురూపమైనదిగా చూస్తుంది. ఆమె పట్ల అగౌరవంగా, అమర్యాదగా వ్యవహరించడాన్ని ఖండిస్తుంది. మధ్యప్రాచ్యంలోని కొన్ని దేశాల్లో మహిళలపట్ల అనుచిత వ్యవహారశైలికి, లేదా కొన్ని ముస్లిమ్ కుటుంబాల్లో మహిళలపట్ల అనుచిత వైఖరికి కారణం స్థానిక సాంస్కృతిక, సాంప్రదాయిక ప్రభావాలే కాని ఇస్లామ్ కాదు. ఈ ప్రభావాలకు గురయి ఈ సంప్రదాయిక అంశాలను కొందరు ముస్లిములు గుడ్డిగా అనుసరించడం వల్ల చోటు చేసుకుంటున్న సంఘటనలివి. దీనికి ఇస్లామ్‌తో సంబంధం లేదు. ఇస్లామ్ స్త్రీలను అణిచివేసే మతమైతే ప్రపంచవ్యాప్తంగా అనేకమంది స్త్రీలు స్వచ్ఛందంగా ఇస్లామ్ ఎందుకు స్వీకరిస్తున్నట్లు?

విశ్వప్రభువు వాక్యాలతో ఈ మాటను ముగిద్దాం. స్త్రీపురుషులందరినీ సృష్టించిన దేవుడు ఇలా సెలవిచ్చాడు.

> నిశ్చయంగా ముస్లిములూ, విశ్వాసులూ, విధేయులూ, నిజాయితీపరులూ, సహనశీలురూ, అల్లాహ్ ముందు వినమ్రులయ్యేవారూ, దానధర్మాలు చేసే వారూ, ఉపవాసం ఉండేవారూ, తమ మర్మాంగాలను కాపాడుకునేవారూ, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించేవారూ, అయిన స్త్రీ పురుషుల నిమిత్తం అల్లాహ్ క్షమాభిక్షను, గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు.
> **(దివ్యఖుర్ఆన్ 33 : 35)**

సంప్రదించండి
ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్
040 - 6832 7832 - Hyderabad




మౌలిక విషయాలు
తెలుసుకుందాం
040 - 6832 7832
Toll Free 1800 572 3000
www.discovertruepath.com
You Tube : DiscoverTruePath

ఇస్లామ్‌లో మహిళల అణిచివేత ఉందని, వారిని తక్కువగా చూస్తారని ప్రచారం వినిపిస్తుంది. కాని ఇది నిజమా? ఇస్లామ్‌లో మహిళలు అణిచివేతకు గురవుతున్నారా? లేక ఇదంతా కేవలం పక్షపాత మీడియా సృష్టిస్తున్న అభూత కల్పనా?

> మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి.
> ఖుర్‌ఆన్ 2 : 228

దాదాపు పద్నాలుగువందల సంవత్సరాల క్రితం ఇస్లామ్ మహిళలకు ప్రసాదించిన హక్కులను పాశ్చాత్య మహిళలు కేవలం ఇటీవలి కాలంలో గాని పొందలేక పోయారు. 1930లో అనిబిసెంట్ ఈ విషయంపై మాట్లాడుతూ, “గత 20 సంవత్సరాల క్రితమే క్రిస్టియన్ ఇంగ్లాండ్ మహిళల ఆస్తి హక్కును గుర్తించింది. కాని ఇస్లామ్ ఆరంభం నుంచి (14వందల సంవత్సరాల క్రితమే) ఈ హక్కును ప్రసాదించింది. మహిళలకు ఆత్మ ఉండదని ఇస్లామ్ చెబుతుందంటూ ప్రచారం చేయడం దుష్ప్రచారం మాత్రమే.’’

(ది లైఫ్ అండ్ టీచింగ్స్ ఆఫ్ ముహమ్మద్, 1932)

స్త్రీ పురుషులంతా ఒకే మానవుని - ప్రవక్త ఆదం(అ)వారసులు. ఇస్లాం వీరిరువురితో సమన్యాయం పాటించాలనే ఆదేశిస్తుంది.

## సమాన బాధ్యత - సమాన ప్రతిఫలం

స్త్రీ పురుషులు ఒకే దేవుని ప్రార్థిస్తారు, ఒకేలా ప్రార్థిస్తారు. వీరి ఆరాధనల్లో ఒకేవిధమైన ఆచరణలు ఉంటాయి. ఒకే దైవగ్రంథాన్ని అనుసరిస్తారు. ఒకేవిధమైన విశ్వాసం కలిగి ఉంటారు. సర్వసృష్టికర్త అయిన అల్లాహ్ మనుష్యులందరి పట్ల న్యాయంగా వ్యవహరిస్తాడు. సమానంగా చూస్తాడు. న్యాయం చేస్తానని (స్త్రీ పురుషులకు) తగిన ప్రతిఫలం ప్రసాదిస్తానని అనేక వాక్యాల్లో స్పష్టంగా చెప్పాడు.

> మీలోని ఎవరి శ్రమనూ నేను వృథాగా పోనివ్వను. పురుషుడైనా స్త్రీ అయినా మీరంతా ఒకే రాశికి చెందినవారు.
> (ఖుర్‌ఆన్ 3 : 195)

> విశ్వాసులైన స్త్రీ పురుషులకూ, అల్లాహ్ వాగ్దానం చేశాడు, క్రింద కాలువలు ప్రవహించే తోటలను వారికి ఇస్తాను అని. వారు వాటిలో శాశ్వతంగా ఉంటారు........
> (ఖుర్‌ఆన్ 9:72)

ఈ వాక్యాలను పరిశీలిస్తే ప్రతిఫలం అనేది మనిషి ఆచరణల ఆధారంగా లభిస్తుందే కాని స్త్రీ పురుషులన్న తేడా ఆధారంగా కాదని తెలుస్తోంది. ఒక మనిషికి దేవుని వద్ద లభించే ప్రతిఫలం విషయంలో స్త్రీ పురుషులన్న వివక్ష లేనేలేదు.

మనం ఇస్లామ్‌ను ఇతర మతాలతో పోల్చి చూస్తే, ఇస్లామ్ స్త్రీ పురుషులమధ్య న్యాయం చేస్తుందని గమనించవచ్చు. ఉదాహరణకు, నిషిద్ధ వృక్షం నుంచి ఆహారం తినే విషయంలో ఆదమ్ కన్నా హవ్వా బాధ్యతే ఎక్కువన్న భావనను ఇస్లామ్ తిరస్కరిస్తుంది. ఇస్లామ్ ప్రకారం ఆదమ్, హవ్వాలు(అ) ఇద్దరు అవిధేయతకు పాల్పడ్డారు, తర్వాత ఇద్దరు పశ్చాత్తాపపడ్డారు, వారిద్దరిని క్షమించడం జరిగింది.

## విద్యాజ్ఞానాలు పొందే సమాన హక్కు

విద్యాజ్ఞానాలు పొందాలని స్త్రీపురుషులందరినీ సమానంగా ప్రోత్సహించడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) **“విద్యాభ్యాసం ప్రతి ముస్లిమ్‌కు తప్పనిసరి”** అన్నారు.

ప్రవక్త కాలంలో గొప్ప పండితులుగా అనేక మంది స్త్రీలు ఉన్నారు. ఇందులో కొందరు ఆయన కుటుంబ సభ్యులు. మరికొందరు ఆయన అనుచరులు, అనుచరుల కుమార్తెలు ఉన్నారు. వారిలో ముఖ్యులు హజ్రత్ ఆయిషా. ఆమె వల్లనే ఇస్లామీయ చట్టాల్లో దాదాపు పాతిక శాతం మనకు లభించాయి. ఇంకా అనేకమంది ఇస్లామీయ చట్టాల్లో నిష్ణాతులైన స్త్రీలు ఉండేవారు. అనేకమంది పురుషులు వారి వద్ద విద్యాభ్యాసం చేశారు.

## జీవితభాగాస్వామిని ఎంచుకునే సమానహక్కు

తన జీవితభాగస్వామిని ఎంచుకునే హక్కు స్త్రీకి ఇస్లామ్ ప్రసాదించింది. వివాహం తర్వాత కూడా తన వంశం పేరును అలాగే కొనసాగించుకునే అవకాశమూ ఇచ్చింది. ఆ విధంగా స్త్రీలను ఇస్లామ్ గౌరవించింది. అంతేకాదు, చాలా మంది అనుకుంటున్నట్లు తల్లిదండ్రులు కుమార్తెకు బలవంతంగా వివాహం చేయడం ఇక్కడ సాధ్యం కాదు. ఒకవేళ అలా ఎక్కడైనా జరుగుతుంటే దానికి ఇస్లామ్‌కు సంబంధం లేదు. ఇస్లామ్‌లో ఇది నిషిద్ధం.

ప్రవక్త కాలంలో ఒక మహిళ ఆయన వద్దకు వచ్చి “నా తండ్రి మా బంధువుకు ఇచ్చి నా పెళ్ళి చేశారు. ఆ బంధువు సామాజిక హోదా పెంచడానికి నన్ను బలవంతంగా కట్టబెట్టారు.’’ అని ఫిర్యాదు చేసింది. వెంటనే ప్రవక్త ఆమె తండ్రిని పిలిపించారు. తండ్రి ముందు కుమార్తె ఇష్టాన్ని అడిగారు. ఇష్టమైతే ఆ వివాహంలో ఉండవచ్చు, లేదా రద్దు చేసుకోవచ్చని అడిగారు. ఆమె జవాబిస్తూ “ఓ ప్రవక్తా! నా తండ్రి చేసిన వివాహాన్ని నేను స్వీకరిస్తున్నాను. కాని బలవంతంగా స్త్రీలకు పెళ్ళి చేసే అవకాశం లేదని ఇతర స్త్రీలకు చెప్పాలనుకున్నాను’’ అన్నది.

## సమానులే అయినా ఎవరి ప్రత్యేకత వారిదే

స్త్రీ పురుషులకు సమానహక్కులున్నాయన్నది సాధారణ సూత్రం. అయితే ఎవరి ప్రత్యేకత వారిదే కాబట్టి అందుకు అనుగుణంగా నిర్దిష్ట హక్కులు బాధ్యతలపంపకం కనబడుతుంది. బాధ్యతలను బట్టి హక్కులు కూడా ఇవ్వడం జరిగింది.

స్త్రీ పురుషులమధ్య శరీర నిర్మాణంలో ఉన్న తేడాలే కాకుండా, స్త్రీ పురుషుల మెదడులో భాష, సమాచారం, భావావేశాల ప్రతిస్పందనలు వేర్వేరుగా ఉంటాయన్నది నేడు శాస్త్రవేత్తలకు బాగా తెలిసిన విషయం.

ఉదాహరణకు :

హార్వార్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన సోషియో బయాలజీ నిపుణుడు ఎడ్వర్డ్ ఓ. విల్సన్ ప్రకారం వాక్చాతుర్యంలో, సానుభూతి, సామాజిక నైపుణ్యాల విషయంలో మహిళలు పురుషుల కన్నా మెరుగ్గా ఉంటారు. స్వేచ్ఛ, ప్రాబల్యం, ప్రాదేశిక అవగాహన, గణిత నైపుణ్యం, హూదాపరమైన దూకుడు పోటీ తదితర లక్షణాలు పురుషులకు ఎక్కువగా ఉంటాయి.

ఈ తేడాలను దృష్టిలో ఉంచుకోకుండా స్త్రీపురుషులందరూ ఒకేలాంటి వారిగా జమకట్టడం అవివేకం. ఇస్లామ్ ప్రకారం స్త్రీ పురుషులు ఒకరి కొకరు పూరకాలవంటి వారు. ఇరువురికి సహజ ప్రవృత్తికి అనుగుణంగా వేర్వేరు పాత్రలు, బాధ్యతలు ఉన్నాయి. దేవుడు ఈ విషయమై ఇలా అన్నాడు :

> బాలుడు బాలిక వంటి వాడు కాదు.
> (ఖుర్‌ఆన్ 3 : 36)

> పుట్టించిన వాడికే తెలియదా? వాస్తవానికి ఆయన సూక్ష్మగ్రాహి మరియు సమస్తమూ తెలిసిన వాడూను.
> (ఖుర్‌ఆన్ 67:14)

## కుటుంబం ఒక యూనిట్

దేవుడు స్త్రీ పురుషులను ప్రత్యేక లక్షణాలతో సృష్టించాడు. ఎవరి పాత్రలు వారివే. ఎవరి నైపుణ్యాలు వారివే. ఎవరి బాధ్యతలు వారివే. ఈ తేడాలు ఆధిక్యతకు చిహ్నాలు కానే కావు. ఇవి ప్రత్యేకతలుగా చూడాలి. ఇస్లామ్‌లో కుటుంబానికి అధిక ప్రాముఖ్యం ఉంది. కుటుంబం ఆర్థిక వ్యవహారాలు చూసుకునే బాధ్యత పురుషుడిది. స్త్రీ కుటుంబాన్ని విద్యాపరంగాను, భౌతికంగాను, భావావేశాల పరంగాను చక్కదిద్దు కోవాలి. ఇందులో ఒకరికొకరు సహాయపడడం ఉంటుందే కాని ఒకరితో ఒకరు పోటీ పడడం లేదు. ఎవరి బాధ్యతలను వారు నిర్వర్తించడం వల్ల కుటుంబాలు బలంగా ఉంటాయి. బలమైన కుటుంబాలవల్ల బలమైన సమాజం ఏర్పడుతుంది.

మానసికంగా స్త్రీ లేకుండా పురుషుడు కాని, పురుషుడు లేకుండా స్త్రీ కాని సంతోషంగా జీవించలేరు. ఈ విషయాన్ని దేవుడు అందంగా తెలియజేశాడు :

> ... వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు ...
> (ఖుర్‌ఆన్ 2:187)